క్లుప్తంగా

కెనరా బ్యాంకు ద్వారా రూ.71 కోట్ల లావాదేవీలు



ఏకే మల్లవరంలో బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు ద్వారా రూ.71 కోట్ల లావాదేవీలు నిర్వహించినట్లు ఆ బ్యాంకు డివిజనల్ మేనేజర్ ఎన్.ప్రవీణ్‌బాబు తెలిపారు. ఏకే మల్లవరంలో కెనరా బ్యాంకు నూతన భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. రానున్న రోజుల్లో బ్యాంకు సేవలను మరింత విస్తృతం చేస్తామని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జీఎస్‌బీ ఆనందకుమార్ తెలిపారు. ఖాతాదారుల సౌకర్యార్థం నూతన భవనంలోకి బ్యాంకు మార్చుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, ఉప సర్పంచ్ అరిగెల మణిబాబు, బ్రాంచి మేనేజర్ పి.గోవిందరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతితోనే ప్రశాంత జీవనం



సామర్లకోటలో బ్రహ్మకుమారి ఈశ్వరీయ ఆశ్రమం ప్రారంభిస్తున్న రజని

సామర్లకోట: సమాజ శాంతితో ప్రశాంత జీవనం సాధ్యపడుతుందని కాకినాడ ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కాకినాడ శాఖల రాజయోగిని బ్రహ్మకుమారి రజని అన్నారు. గురువారం స్థానిక మెహర్ కాంప్లెక్స్ సమీపంలోని అంబటివారి తోటలో నూతనంగా నిర్మించిన బ్రహ్మకుమారి ఈశ్వరీయ ఆశ్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ప్రశాంత జీవనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. బ్రహ్మకుమారి లక్ష్మి, మిరాహిల్, కర్రి పాపారావు ఆశ్రమ శిష్య బృందం పాల్గొన్నారు.

భూమి పట్టాలు ఇప్పించండి



ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పెద్దాపురం: ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్న తమకు భూ పట్టాలు ఇప్పించాలని ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్‌లోని తొండంగి మండలం కోదాడ, కొమనాపల్లి గ్రామాల రైతులు బుధవారం ధర్నా చేశారు. నక్కా నాగు, శివకోటి రాజు, దడాల సూరిబాబు తదితరులు ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మూడు తరాలుగా 70 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. కొందరు తమ భూములపై కన్నేసి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని, వారికి పోలీసుల మద్దతు ఉండడంతో తమపై తప్పుడు కేసులు పెడుతున్నారని, తక్షణమే తమ భూములు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దడాల సూర్యప్రకాష్, బుర్తి లోవరాజు, నొక్కు నాగన్న, శివకోటి అత్మారావు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ నుంచి ఆయిల్ లీక్

జారి పడిన వాహన చోదకులు



రైల్వే గేటు ఎదురుగా ఆయిల్ లీకైన రోడ్డుపై వేసిన గ్రావెల్

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ఉన్న రైల్వే గేటు ఎదురుగా సామర్లకోట నుంచి కాకినాడ వెళ్తున్న ఆయిల్ ట్యాంకరు నుంచి రోడ్డుపై ఆయిల్ లీకైంది. దీనిని గమనించని వాహన చోదకులు అదుపుతప్పి జారిపోయారు. విషయాన్ని తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆయిల్ లీకైన ప్రదేశంలో గ్రావెల్‌ను వేయించి వాహన చోదకులను అప్రమత్తం చేయించారు.

ప్రశాంతంగా ప్రీ ఫైనల్ పరీక్షలు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థుల్లో భయం పోవడానికి, నమూనా ప్రశ్న పత్రం తెలిసేలా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలో 16 ప్రభుత్వ, 12 ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు వారి పాఠశాలలోనే పరీక్షలు రాశారు. ఈనెల 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి.

చేతికందే ఎత్తులో ప్రమాదం

- గ్రామాల్లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- పలు చోట్ల ప్రమాదాలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

కొత్తపల్లి: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కరువైంది. మరికొన్ని ప్రాంతాల్లో చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. పిల్లలు ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో ఆటలాడడంతో ఏప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు.

తీర గ్రామాల్లో..

నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, అమీనాబాద్, పొన్నాడ, కోనపాపపేటతో పాటు కొమరగిరి, కొత్తపల్లి, ఇసుకపల్లి, గొర్స, కొండెవరం, కుతుకుడుమిల్లి గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచెలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నిసార్లు చెప్పిన విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



అమీనాబాద్‌లో చేతికందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదాల వివరాలు

- గతంలో కొండెవరం వేంకటేశ్వరస్వామి ఆలయ పక్క వీధిలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి పాడి గేదె మృతి చెందింది.
- కొండెవరం ఇందిరాకాలనీలో 11 కేవీ విద్యుత్ తీగలు ఇంటి మీదుగా ఉండడంతో మేడ మీదకు వెళ్లిన విద్యార్థికి తీగలు తగిలి మరణించాడు.
- కొత్త ఇసుకపల్లిలో సచివాలయ కార్యాలయం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి పాడిగేదె మృతి చెందింది. పలువురు విద్యుత్ శాఖ అధికారులకు తీగలు తగిలి గాయాలయ్యాయి.

స్తంభం ఎక్కినా, మీటర్ బిగించినా మామూళ్లు

మండలంలోని విద్యుత్ శాఖ సిబ్బంది మామూళ్ల మత్తులో పడ్డారు. గృహాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు స్తంభం ఎక్కి మరమ్మతులు చేసినా, కొత్త విద్యుత్ మీటర్ బిగించినా మామూళ్ల వసూళ్లు చేస్తున్నారు. స్తంభం ఎక్కితే రూ.100, కొత్త విద్యుత్ కనెక్షన్, విద్యుత్ మీటర్ మార్పు చేస్తే రూ.300 నుంచి రూ.500 వరకూ సిబ్బంది వసూలు చేస్తున్నారని వినియోగ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచాలు ఏర్పాటు చేస్తాం

గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచాలు ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు పనులు ప్రారంభిస్తాం. లైన్ మెన్లు గ్రామాల్లో మరమ్మతులు నిర్వహించాలి. ప్రైవేటు వ్యక్తులతో మరమ్మతులు చేయించరాదు. జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే అమరవల్లి, పొన్నాడ లే అవుట్లలో పనులు పూర్తయ్యాయి. ఇళ్లు నిర్మించుకున్న వారికి ఉచితంగా విద్యుత్ మీటర్‌ను ఇస్తారు. ఎవరైనా సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేస్తే 94408 12642 నంబర్‌కు సమాచారం ఇవ్వండి.

ప్రమోద్,
విద్యుత్‌శాఖ ఏఈ, కొత్తపల్లి

సంప్రదాయాలను పాటించాలి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని, తద్వారా రానున్న తరాలకు వాటిని అందించాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు కోరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గురువారం తాడి పెద్దుకు అచ్చు వేసే కార్యక్రమం (వృషతోత్సర్జన) నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని తాడిపెద్దుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలు విదేశీయులు సైతం అలవర్చుకుంటున్నారంటే వాటి గొప్పదనం ఏమిటో అర్థమవుతోందన్నారు. ప్రతిఒక్కరూ దేశ సంప్రదాయాలను కొనసాగించాలని సూచించారు. ఆవుకు ఉన్న విలువ ప్రపంచ దేశాలను మన వైపు చూసేలా చేసిందని, వాటి పోషణకు ప్రభుత్వం సైతం పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



తాడిపెద్దుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు

ఉగాది నాటికి జగనన్న ఇళ్లు పూర్తి చేయాలి



పవరలోని జగనన్న కాలనీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

సామర్లకోట: జగనన్న కాలనీలను ఉగాది నాటికి పూర్తి చేసుకోవాలని ఎంపీఈఓడీ డి.శ్రీలలిత అన్నారు. గురువారం మండల పరిధిలో పవరలోని జగనన్న లే అవుట్లను ఆమె పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో సీఎం జగన్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, రుణ సౌకర్యాలు కల్పిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. ఐకేపీ ఏపీఎం వి.ప్రశాంతి, పార్టీ గ్రామ కన్వీనర్ నాగనబోయిన రాజబాబు, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన చంటిబాబు, హౌసింగ్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ వీకే రాయపురం ఎంపీటీసీ 2కు సంబంధించిన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమమహేశ్వరి

నిర్మాణాలు వేగవంతం చేయండి : ఎంపీడీఓ హిమమహేశ్వరి

పెద్దాపురం: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాల వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఆయా గ్రామాల సచివాలయాల పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఏఈ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల నుంచి అందించే రుణాలను సకాలంలో అందించి ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలను సత్వరం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యాలయ సీనియర్ సహాయకులు జగన్నాథం, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో పట్టపగలే విద్యుత్ వెలుగులు ప్రసరిస్తున్నాయి. గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడులో నిరంతరం వీధిలైట్లు వెలుగుతూ ఉంటున్నాయి. విద్యుత్‌ను ఆదా చేయవలసిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పంచాయతీకి సైతం విద్యుత్ బిల్లుల భారం పెరుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ముమ్మిడివారిపోడులో పగలే వెలుగుతున్న వీధి దీపాలు

పేదలందరికీ ఉపాధి పనులు

- డ్వామా పీడీ వెంకటలక్ష్మి

గండేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు తప్పనిసరిగా ఉపాధి హామీ పనులు కల్పించాలని కాకినాడ జిల్లా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సిబ్బందికి సూచించారు. మండలంలోని నీలాద్రిరావుపేట పెద జగ్గమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఉపాధి హామీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. జిల్లావ్యాప్తంగా రోజుకు లక్ష పని దినాలు కల్పించాల్సి ఉండగా వ్యవసాయ పనులు అందుబాటులో ఉన్నందున కూలీలు ఉపాధి పనులకు రాకపోవడంతో ప్రస్తుతం 40,000 వేల పనిదినాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 17 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉందన్నారు. ఒక్కో మేటు తమ పరిధిలోని 50 కుటుంబాలకు పనులు కల్పించాలన్నారు. పనులు పాదర్శకంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట ఉపాధి ఏపీఓ ఎన్.గంగాభవానీ, అబ్బు, తదితరులు ఉన్నారు.



పెద జగ్గమ్మ చెరువులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

గండేపల్లి: విద్యార్థులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సెంటర్ ఆఫ్ వుమెన్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల మేథస్సును పెంచేందుకు దోహదపడతాయన్నారు. ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఇనిషియేటివ్ హనీవెల్ అనే గ్లోబల్ సర్టిఫికేషన్ కోర్సును తమ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థినులకు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, ఎస్.శంభూప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, ప్రిన్సిపాల్ కె. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ జి.నరేష్, ఎస్.కోటేశ్వరి, పి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంచి కుటుంబ కథా చిత్రం ఎవడు వాడు

రౌతులపూడి: ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ల ద్వారా యువత పెడదోవ పట్టకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలనే ఉద్దేశంతో తీసిన మంచి కుటుంబ కథా చిత్రం 'ఎవడు వాడు' అని సినీ హీరో రెడ్డి కార్తికేయ అన్నారు. రాజేశ్వరీ సినీ క్రియేషన్స్ బేనర్‌పై ఎవడు వాడు సినిమా శుక్రవారం విడుదల అవుతున్న నేపథ్యంలో హీరో రెడ్డి కార్తికేయ గురువారం రౌతులపూడిలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో యువత సెల్‌ఫోనే జీవితం అన్నట్లుగా బతుకుతున్నారన్నారు. నిత్యం సెల్‌ఫోన్లు వాడి పెడదోవ పట్టి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అలాంటి వారికి మంచి జీవితాన్ని అందించడమే ఈ చిత్రం సారాంశమన్నారు. ఆర్.నారాయణమూర్తి సినీ వారసుడిగా తనను ప్రేక్షకుల ఆదరించాలని కోరారు.

ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



రమేష్ బాబు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అల్లాడ రమేష్ బాబుకు డాక్టరేట్ లభించినట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎస్. సతీష్ రెడ్డి గురువారం తెలిపారు. కళాశాలలోని హెచ్‌బీఎస్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందిస్తున్న రమేష్‌బాబు కడప కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మ్యాథ్స్ ప్రొఫెసర్ బి.రామభూపాల్ రెడ్డి నేతృత్వంలో 'ఏ స్టడీ ఆన్ ఫుజీ లీనియర్ ప్రోగ్రామింగ్ ఫర్ ఆప్టిమైజేషన్ ప్రాబ్లెమ్స్' అనే శీర్షికతో సమర్పించిన థీసిస్‌కు అనంతపురం యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసినట్టు వివరించారు. డాక్టరేట్ పొందిన రమేష్ బాబుకు ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, డోలా సంజయ్, డీన్ ఎ.రామకృష్ణ, విభాగాధిపతి పద్మప్రవీణ్, , పి.వేణుగోపాల్, పలు విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

త్వరలో ఆసుపత్రి దర్శనాలు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఘనంగా కిడ్నీ దాతల సత్కారం

కాకినాడ క్రైం: ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను పరిశీలించేందుకు ఏ నాయకుడూ రూపొందించని బృహత్కార్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గాల పరిధిలో త్వరలో ఆసుపత్రి దర్శనాలు (హాస్పిటల్ విజిట్స్) చేపట్టబోతున్నట్లు తెలిపారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కిడ్నీ దాతల సత్కార కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుత వైఎస్సార్ విశ్వవిద్యాలయ విశ్రాంత వీసీ డాక్టర్ ఐవీ రావు, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఆర్ఎస్ జవహర్ వంటి ప్రముఖులు అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ మాట్లాడుతూ అవయవదాన ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సత్కార్యాన్ని ఓ యజ్ఞంలా చేపట్టి కొనసాగిస్తున్న అపోలో ఆసుపత్రి యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. దాదాపు ప్రతి రోగాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. త్వరలో 13 వైద్య కళాశాలలు ఏర్పాటు కానున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యుల నియామక ప్రక్రియ శరవేగంగా సాగుతోందని ఆయన అన్నారు. జనసాంద్రతకు అనుగుణంగా పరిశీలిస్తే దేశంలో 40 శాతం మంది వైద్యులు తక్కువ ఉన్నారని, రాష్ట్రంలో ఆ లోటు 0.5 శాతమేనని తెలిపారు. ఆ అర శాతం లోటూ మార్చి నెలాఖరుకు భర్తీ కానుందని ఎమ్మెల్యే ప్రకటించారు. ఆరోగ్యశ్రీ రూపకల్పన కాకినాడ వైద్యుడు ఐవీ రావు మార్గనిర్దేశంలో జరగడం గర్వించదగ్గ విషయమని అన్నారు. కాకినాడ వాసుల్లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరం ఉన్న వారు తమ ప్రయత్నాల వల్ల ప్రయోజనం పొందలేకపోతే తనను నేరుగా సంప్రదించాలని ఎమ్మెల్యే అన్నారు.

ఒక శరీర దానం వల్ల 8 మందికి పునర్జన్మ

డాక్టర్ ఐవీ రావు మాట్లాడుతూ ఓ వ్యక్తి శరీరం నుంచి సేకరించిన అవయవాలు కనీసం 8 మందికి పునర్జన్మనిస్తాయని తెలిపారు. ప్రతి టీచింగ్ ఆసుపత్రిలో అవయవ దాన యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. ప్రభుత్వం జీవన్‌దాన్ కార్యక్రమం ద్వారా అవయవ దానాన్ని విస్తృతం చేస్తోందని, ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు జీవన్‌దాన్‌లోని ఆర్గాన్ రిజిస్టర్‌లో తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

అనంతరం పలువురు కిడ్నీ దాతల్ని అపోలో ఆసుపత్రి తరఫున అతిథులు సత్కరించారు. అపోలో ఆస్పత్రి సీనియర్ జనరల్ మేనేజర్ ఐవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అపోలో వైద్యులు జీవీ.రావు, కరుణాకర్‌రెడ్డి, పి.రవీంద్ర, పి.శర్మిష్ఠ, నాగేశ్వరరావు, పీపీ చటర్జీ కిడ్నీ ఆరోగ్యం, తీసుకోవలసిన జాగ్రత్తలు, కిడ్నీ దానం, ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై అవగాహన కల్పించారు. ఆసుపత్రి తరఫున జీవీఆర్ మూర్తి మాట్లాడుతూ, అధిక బ్రెయిన్ డెడ్‌లు జీజీహెచ్ కేంద్రంగా జరుగుతున్నాయని, వెలకట్టలేని విలువైన అవయవాలు వృథా అవుతున్నాయనీ, హార్వెస్టింగ్ అనుమతులిస్తే రోగుల్ని తరలించి వారి అనుమతితో అవయవాలు సేకరించే వెసులుబాటు తమ వద్ద ఉందనీ, అందుకు తగ్గ అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ద్వారంపూడి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అనుమతులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కోళ్లఫారం యజమానికి నోటీసులు



కాలువలో కోళ్ల వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

పెద్దాపురం: కాలువలో కోళ్ల వ్యర్థాలు, చనిపోయిన కోళ్లతో ఇబ్బందులు పడుతున్న ప్రజా సమస్యపై జి.రాగంపేట పంచాయతీ అధికారులు స్పందించారు. 'సాక్షి'లో ప్రచురితమైన 'ఏలేరులో కుళ్లిన కోళ్లు' కథనంపై పంచాయతీ కార్యదర్శి రమేష్ స్పందించి పారిశుధ్య సిబ్బందిచే కోళ్ల వ్యర్థాలను తొలగించారు. వడ్లమూరు శివారు జి.రాగంపేట పరిధిలో ఉన్న గోరింటకు చెందిన వ్యక్తి కోళ్ల ఫారం నుంచి చనిపోయిన కోళ్లు, వ్యర్థాలు కాలువలో కలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కథనంపై అధికారులు స్పందించి కోళ్ల ఫారం యజమానికి నోటీసులు జారీ చేసి, వ్యర్థాలను తొలగించడంతో అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ఎస్.ఉదయభాస్కర్ గురువారం తెలిపారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి, ఉప్పాడ, అమీనాబాదు గ్రామాలతో పాటు యండపల్లి, నాగులపల్లిలోని రొయ్యల చెరువులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వైభవంగా శ్రీపుష్పయాగం



స్వామికి పండ్లు, స్వీట్లు, పుష్పాలతో అలంకరణ

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి శ్రీ పుష్పయాగం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు వివిధ రకాలు పుష్పాలు, వివిధ రకాలు స్వీట్లు, పండ్లతో పుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా దినోత్సవ క్రీడలు



షాట్‌పుట్‌లో పోటీపడుతున్న క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు గురువారం రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. క్రీడా మైదానంలోని అథ్లెటిక్స్ ట్రాక్‌లో 100, 400 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్‌జంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 60 మంది మహిళలు హాజరయ్యారు. పోటీల నిర్వహణలో కోచ్‌లు సతీష్‌కుమార్, రుద్ర, సురేష్, అలీష షరీఫ్, నాగేంద్ర పాల్గొన్నారని చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

ఆ జీవోల్లో స్థానం కల్పించండి

కాకినాడ క్రైం: వైద్య ఆరోగ్యశాఖలో రేషనలైజేషన్‌లో భాగంగా ఇటీవల అమలులోకి వచ్చిన జీవో 143, జీవో 32లో ఆఫీస్ సబార్డినేట్, ఎంఎన్‌వో కేడర్లకు స్థానం కల్పించాలని కోరుతూ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘ జిల్లా ప్రతినిధులు గురువారం ఉన్నతాధికారులకు విన్నవించారు. ఆరోగ్య సంచాలకుడు వి.రామ్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబులను వెలగపూడిలో కలసి ఈ మేరకు వినతి సమర్పించారు. పీహెచ్‌సీల్లో కామన్ స్టాఫ్ పాటర్న్‌గా 14 రకాల ఉద్యోగాలను పొందుపరిచిన విషయాన్ని గుర్తు చేశారు. కొనసాగింపుగా ఆఫీస్ సబార్డినేట్, ఎంఎన్‌లో కేడర్లను సదరు జీవోల్లో చేర్చాలని విన్నవించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో అధికారులను కలసిన వారిలో జిల్లా నాయకులు ఎ.దేవర, ఎస్.రాజశేఖర్, పి.వెంకయ్య, లావణ్యకృష్ణ స్వామి ఉన్నారు.